# జనోదయ

RNI No - APTEL/2022/81596

తెలుగు దినపత్రిక

కరీంనగర్ ఆదివారం 15.02.2026 సంపుటి : 03 సంచిక :72 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Sunday 15.02.2026 Volume: 03 Issue 72 Pages 08 Cost 5/


## మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** తెలంగాణ మున్సి పల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. మున్సి పల్ ఎన్ని కల ఫలితాలపై మంత్రుల ను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రే వంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులంద రూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు.ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు

## మావోయిస్టు డంప్‌ల గుర్తింపు

### సుకుమా జిల్లాలో మావోయిస్టు స్మారక స్తూపం కూల్చివేత



**చర్ల, ఫిబ్రవరి 14 :** ఛత్తీస్‌గఢ్‌లోని అడవుల్లో రెండు వేర్వేరు చోట్ల మావోయిస్టు పార్టీ డంప్‌లను శనివారం కేంద్ర భద్రతా బలగాలు గుర్తించాయి. మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారం మేరకు కేంద్ర భద్రతా బలగాల కూంబింగ్‌లో కాంకేర్- నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని బీనగూడ-చౌటేబేతియా, కర్రె గుట్టల్లో ఈ డంప్‌లు దొరికాయి. ఈ డంప్‌ల్లో మావోయిస్టు పార్టీ వస్తువులు, తుపాకులు, బీజీఎల్స్ లాంచర్లు, ఐఈడీ సహా ఇతర పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. సుకుమా జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన భారీ స్మారక స్థూపాన్ని శనివారం కేంద్ర బలగాలు కూల్చేశాయి.

## సీపీఐ, కాంగ్రెస్.. చెరో రెండున్నరేళ్లు

### 'కొత్తగూడెం'పై ఒప్పందం



**కొత్తగూడెం, ఫిబ్రవరి 14 :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఉత్కంఠ వీడింది. చెరో రెండున్నరేళ్లు మేయర్ పదవిని పంచుకోవాలని సీపీఐ, కాంగ్రెస్ అవగాహనకు వచ్చాయి. సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేతల భేటీ అనంతరం దీనిపై స్పష్టత వచ్చింది. తొలి రెండున్నరేళ్లు సీపీఐ మేయర్, కాంగ్రెస్ డిప్యూటీ మేయర్ పదవులు తీసుకోనుండగా.. తర్వాతి రెండున్నరేళ్లు కాంగ్రెస్ మేయర్, సీపీఐ డిప్యూటీ మేయర్ పదవులను తీసుకునేలా ఒప్పందం కుదిరినట్టు ఆ పార్టీల నేతలు వెల్లడించారు.కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. ఈ మేరకు సీపీఐకి చెందిన ఎస్టీ కార్పొరేటర్‌కు మేయర్ పదవి దక్కనుంది. సీపీఐకి ముగ్గురు ఎస్టీ కార్పొరేటర్లు మూడ్ గణేశ్, నునావత్ శ్యామల, బాణోత్ కళావతి ఉన్నారు. వీరిలో సుజాతనగర్ డివిజన్‌కు చెందిన గణేశ్‌కు మేయర్ పీఠం దక్కే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

## 'ఈశాన్యం'లో తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ షురూ

### ఎన్నికలకు సిద్ధంగా ఉన్న అస్సాంలో పలు అభివృద్ధి పనులకు మోదీ ప్రారంభోత్సవం



**మోరన్, ఫిబ్రవరి 14:** ఎన్నికలకు సిద్ధంగా ఉన్న అస్సాం రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పర్యటించారు. డిబ్రూగఢ్-మోరన్ జాతీయ రహదారిపై నిర్మించిన అత్యవసర రహదారిపై సీ-130జె ఆయన ప్రయాణించిన విమానం ల్యాండింగ్ కావడంతో ఈశాన్య భారతంలో తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ సౌకర్యం (ఈఎల్ఎఫ్) ప్రారంభమైంది. సాధారణంగా భారీ వాహనాలు ప్రయాణించే ఈ హైవేపై 4.2 కి.మీ విస్తీర్ణాన్ని ఇప్పుడు విపత్తులు లేదా ఆకస్మిక పరిస్థితులలో సాయుధ దళాలకు అత్యవసర ల్యాండింగ్ స్ట్రిప్‌గా ఉపయోగపడేలా అప్‌గ్రేడ్ చేశారు. 2021లో రూ. 98.86 కోట్లతో రూపొందించిన నాలుగు లేన్‌ల ఈఎల్ఎఫ్ ప్రాజెక్టు సైనిక, పౌర విమానాల ల్యాండింగ్‌లు, టేకాఫ్‌లకు ఉపయోగపడేలా భారత వైమానిక దళ సమన్వయంతో నిర్మించారు. ఈ సందర్భంగా ఎయిర్ ఫోర్స్ నిర్వహించిన 20 ఎయిర్‌షోలో హైవేపై విమానాల ల్యాండింగ్, టేకాఫ్, ఇతర విన్యాసాలను ప్రదర్శించారు. బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన ఆరు లేన్ల వంతెనను, ఒక ఐఐఎంను, ఒక డాటా సెంటర్‌ను మోదీ తన పర్యటనలో భాగంగా ప్రారంభించారు.

## రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్




హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు గుడ్ న్యూస్ చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది.ఈరోజు (శనివారం) సాయంత్రం 6 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో మంత్రులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

## పాక్‌తో సింధు జలాల ఒప్పందం రద్దు

### త్వరలోనే ప్రారంభం కానున్న వులార్ బ్యారేజ్ నిర్మాణం

జమ్మూ-కాశ్మీర్ ప్రాంతంలోని జీలం నదిపై నాలుగు దశాబ్దాలుగా నిలిచిపోయిన వులార్ బ్యారేజ్ నిర్మాణం త్వరలోనే ప్రారంభం కానుంది. పాకిస్తాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో ఇక ప్రాజెక్టును తిరిగి ప్రారంభించే చర్యలు మొదలయ్యాయి. పహల్గాంపై పాక్ ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఉన్న సింధు జలాల ఒప్పందాన్ని ఇండియా గత ఏడాది రద్దు చేసుకుంది. ప్రపంచ బ్యాంకు సూచన మేరకు 1960లలో ఇరు దేశాల మధ్య కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు భారత్ గతేడాది ప్రకటించింది.దీంతో మన దేశం నుంచి పాకిస్తాన్ వెళ్లే నదులకు సంబంధించిన ప్రాజెక్టుల్ని నిరభ్యంతరంగా ప్రారంభించవచ్చు. గతంలో ఈ ప్రాజెక్టుల్ని చేపడితే నాటి ఒప్పందాన్ని సాకుగా చూపి పాక్ అడ్డుపడేది. దీంతో భారత సరిహద్దు, జమ్మూ-కాశ్మీర్ ప్రాంతంలోని జీలం, చీనాబ్, సింధు వంటి నదుల పరిధిలో పలు ప్రాజెక్టులు ఆగిపోయాయి. అయితే, ఒప్పందం రద్దు నిర్ణయం ఇండియాకు భారీ ప్రయోజనం కలిగిస్తోంది. ఒప్పందం రద్దు కావడంతో దశాబ్దాలుగా ఆగిపోయిన ప్రాజెక్టులకు ఇప్పుడు మోక్షం కలుగుతోంది. ఈ నేపథ్యంలో జీలం నదిపై నిర్మించ తలపెట్టిన వులార్ బ్యారేజ్‌ను జమ్మూ-కాశ్మీర్ ప్రభుత్వం ప్రారంభించబోతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా నది నీటిని నిల్వ చేసి, ఈ ప్రాంత వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి వంటి అవసరాలకు వాడుతారు.1980లలో ప్రారంభించిన వులార్ బ్యారేజ్ ప్రాజెక్టును 1987లో పాక్ ఒత్తిడితో నిలిపివేశారు. ఆ తర్వాత పలుమార్లు ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించినప్పటికీ పాక్‌తో సింధు జలాల ఒప్పందం వల్ల ముందుకు కదల్లేదు. చివరగా 2012లో ఈ పనులు నిలిచిపోయాయి. అప్పట్లో పాక్ తీవ్రవాదులు ఈ అంశంపై హెచ్చరికలు జారీ చేశారు. ఇక్కడ నిర్మాణం చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించడంతో కార్మికుల భద్రతరీత్యా నిలిపివేశారు. అయితే, ఈ ప్రాజెక్టును ఇప్పుడు తిరిగి ప్రారంభించేందుకు జమ్మూ-కాశ్మీర్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాయి. ఈ అంశాన్ని జమ్మూ-కాశ్మీర్ సీఎం ఒమర్



అబ్దుల్లా ఇటీవలే ప్రకటించారు.త్వరలోనే తిరిగి పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఈ ప్రాంతంలో ఏడాదంతా నీటి కొరత ఉండదు. అలాగే స్థానికులకు నిర్మాణ పరంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులు కూడా ప్రారంభమయ్యాయి.

## జడ్జిలు పరిమితులు తెలుసుకోవాలి

### వాళ్లు పరిపూర్ణంగా కనిపించే ప్రయత్నం వల్లే న్యాయ వ్యవస్థ బలహీనం: సీజేఐ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** న్యాయమూర్తులు అసంపూర్ణులుగా ఉంటే న్యాయ వ్యవస్థ ఇబ్బంది పడదని, అయితే వారు పరిపూర్ణులుగా కనిపించడానికి ప్రయత్నించినప్పుడు మాత్రం అది ఇబ్బంది పడుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కామన్‌వెల్త్ దేశాల్లో న్యాయ విద్య, న్యాయవాదులు, న్యాయమూర్తులను అనుసంధానించడానికి ఒక సంస్థను సృష్టించాలని ఆయన సూచించారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తులు కేవలం గత తీర్పుల ఆధారంగానే వ్యహరించకూడదని, వాటిని అర్థం చేసుకుని ప్రస్తుత పరిస్థితులకు వాటిని ఎలా అన్వయించుకోవాలో తెలుసుకుని తీర్పు ఇవ్వాలన్నారు.గతంలో న్యాయ వ్యవస్థలో పేరొందిన వ్యక్తులంతా తమ అసంపూర్ణ త్వాన్ని ఒప్పుకొన్నారని, తమ పరిమి తులు గుర్తించారని, తప్పులు జరగడానికి గల అ వకాశాలను అంగీకరించారని, నేర్చుకోవడానికి సంసిద్ధత తెలిపారని అంటూ ఇది ప్రస్తుతమున్న వారందరికీ వర్తిస్తుందని అన్నారు. వినయం అనేది వ్యక్తిగత లక్షణం కాదని, అది వృత్తికి రక్షణ కవచమని, దీనిని ప్రతి న్యాయాధికారికీ బోధించాలని అన్నారు. న్యాయమూర్తులు తమ పరిమితులను అర్థం చేసుకోవాలని, తప్పులు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎందుకంటే చట్టం అనేది సమాజంతో పరిణామం చెందే ఒక శక్తిమంతమైన వ్యవస్థ అని సీజేఐ పేర్కొన్నారు.

జనోదయ



# నేడే బుగ్గలో మహా శివరాత్రి జాతర

**ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి**

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 14:**

బెల్లంపల్లి మండలం కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శివరాత్రి మహా జాతర కన్నుల పండుగగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవాదాయ శాఖ ఈవో గుర్రం బాపురెడ్డి, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ దూడం మహేష్‌ల ఆధ్వర్యంలో అంకుశం సర్పంచ్ బొంతల అరుణ చంద్రమోహన్, కన్నాల సర్పంచ్ నాతరి మల్లమ్మ, అంకుశం ఉప సర్పంచ్ కొప్పుల భానుచందర్, దేవస్థానం మాజీ చైర్మన్ లు మంద అనిత, మాసాడి శ్రీదేవిశ్రీరాములు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ది రాజేందర్, సుంకరి రాజేశం, పుష్ప, మంద ఉదయ వికాస్, మీస రమేష్, చిలువేరు అరవింద్, కన్నాల వార్డ్ సభ్యులు బామండ్లపల్లి భరత్ కుమార్, నాయకులు నాతరి మూర్తిల సమక్షంలో దేవస్థాన అర్చకులు శ్రీరాం భట్ల వేణుగోపాల శాస్త్రి, సతీష్ శర్మల వేదమంత్రోచ్ఛరణల మధ్య శనివారం శివాలయంలో ప్రత్యేక పూజలు, శివపార్వతుల కళ్యాణ మహోత్సవం లో భాగంగా పచ్చని పందిరి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

**... ఏర్పాట్లు పూర్తి**

బుగ్గలో శివరాత్రి జాతరకు రెండు లక్షల భక్తులు హాజరు కానున్నట్లు అంచనా. భక్తులకు ఇబ్బందులు లేకుండా జాతర ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. బెల్లంపల్లి బుగ్గ మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టింది. అంకుశం, బోయపల్లి రోడ్లను మరమ్మతులు చేపట్టింది. స్నానాల కోసం కోనేటిది కొత్త నీటితో నింపింది. పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేసింది. రాత్రి జరిగే శివపార్వతుల కళ్యాణం వేడుకలను వీక్షించేందుకు దేవస్థానం ఆవరణలో లైటింగ్ ఏర్పాటు చేసింది. భక్తుల దర్శనాల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేసింది. విఐపి, సులభ దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్ ను ఏర్పాటు చేసింది. భక్తులకు బెల్లంపల్లి పాత బస్టాండ్, కాంట ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్ సేవలను అందిస్తుంది. కాసిపేట ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదాని సిమెంట్ కంపెనీ యాజమాన్యం జాతరలో 10 వేల లీటర్ల మినరల్ వాటర్ అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు.



**సౌకర్యాలు కల్పించడంలో ఎండోమెంట్ నిర్లక్ష్యం**

ప్రతిసారి మహాశివరాత్రి కి బుగ్గలో జరిగే జాతరకు రెండు లక్షల వరకు భక్తులు వస్తుంటారు. దేవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపడుతారు. భక్తుల కానుకలు ద్వారా లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా ఎండోమెంట్ అధికారులు సౌకర్యాలు కల్పించడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. భక్తులకు త్రాగునీరు, అల్పాహారం, భోజనాలు, లైటింగ్ సౌకర్యం ఇతర సదుపాయాలు దాతలు కల్పిస్తున్నారు. మూడు రోజుల జాతర, ప్రత్యేక పర్వదినాల్లో అర్చన, అభిషేకం, దర్శనం, టికెట్లు, తై బజార్ , వాహనాల పార్కింగ్, ప్రసాదం, కొబ్బరికాయల అమ్మకాల వేలం పాటలు,హుండీ కానుకల ద్వారా ఎండోమెంట్‌కు లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. ప్రతిసారి శివరాత్రి జాతరకు వచ్చే పోలీసు సిబ్బందికి భోజన సౌకర్యం, క్యూలైన్లు, టెంట్లు, దేవస్థానానికి లైటింగ్ తదిత సౌకర్యాలు మాత్రమే చేపడుతూ వాటి బిల్లుల్లోను చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దాతలు జాతరలో కల్పించే సౌకర్యాలపై కూడా ఎండోమెంట్ అధికారులు తప్పుడు బిల్లులు సృష్టించి జాతర ఆదాయాన్ని దిగమింగుతున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రతిసారి మట్టి రోడ్లకు దాతల సహకారంతో మరమ్మతులు చేపట్టి వాటిపై కూడా నిధులు ఖర్చు చేస్తున్నట్లు తప్పుడు లెక్కలు సృష్టించి జాతర ఆదాయాన్ని స్వాహా చేస్తున్నారని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. మహిళలకు సౌకర్యంగా ఉండేందుకు ఏర్పాటుచేసిన మూత్రశాలలకు తలుపులు కూడా బిగించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడం జాతరలో వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.

---

**అర్హత కలిగిన ప్రతి ఎస్టీ కుటుంబానికి**

## ప్రభుత్వ లబ్ధి చేకూరాలి

**నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవు**

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్**



**జనోదయ : డి హీరేహాళ్ (అనంతపురం) ఫిబ్రవరి 14 :**

జిల్లాలో ఎస్టీలకు అందించాల్సిన ప్రభుత్వ లబ్ధి తప్పక అందించాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పక ఉంటాయని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ ఆదేశించారు.అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో మరియు గిరిజన నాయకులతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్పతో కలిసి జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

## శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



**ఏర్పాట్లు పరిశీలించిన రూరల్ సీఐ వెంకటరమణ**

**జనోదయ : డి హీరేహాళ్ (అనంతపురం)**

జిల్లాలో ప్రసిద్ధిగాంచినటువంటి ఎంతో ప్రాముఖ్యత కలిగిన శ్రీ గవిసిద్దేశ్వర ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కావడం జరిగినది ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం నాడు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఆంధ్ర కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో కొండలలో వెలిసినటువంటి గవిసిద్దేశ్వరాలయం మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుంది. ఇక్కడ ఎంతో ప్రాముఖ్యత కలిగిన 108 శివలింగాల ప్రతిష్టాపన ఈ ఆలయ ప్రత్యేకత ఈ ఉత్సవాలకు ఆంధ్ర కర్ణాటక తదితర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం జరుగుతుంది. ఈ సందర్భంగా రూరల్ సీఐ వెంకటరమణ ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి సిబ్బందితో కలిసి శనివారం నాడు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించడం జరిగినది ఆలయ కమిటీ సభ్యులతో భక్తుల రాకపోకలు ఇతర కార్యక్రమాల గురించి చర్చించడం జరిగినది ఈ సందర్భంగా మూడు రోజులపాటు దర్శనార్థం ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా ఆలయంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగినది అలాగే వాహనాల రాకపోకలకు సంబంధించి ట్రాఫిక్ అంతరాయం కూడా కలగకుండా తగు చర్యలు చేపట్టాలని రూరల్ సీఐ వెంకటరమణ సిబ్బందికి ఆదేశించడం జరిగినది

# వీర జవాన్లకు ఘనంగా నివాళులు

జనోదయ : మందమర్రి



పుల్వామా దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులు కాగా, దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు పట్టణం లోని మాజీ ఆర్మీ సైనికుడు, సింగరేణి ఎస్ ఒ పిసి ఉద్యోగి రాజేష్ పిహ్వాల్ -- రాణి పిహ్వాల్ దంపతులు. శనివారం పట్టణంలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమర జవాన్ల ను స్మరిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర సైనికుల త్యాగం మరువ లేనిదని, భారతదేశ చరిత్రలో చీకటి రోజు 2019, ఫిబ్రవరి 14 అని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారని, ఈ ఘటన జరిగి నేటికి ఏడు సం,, పూర్తి అయిన సందర్భంగా దేశ సేవలో ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళు లు అర్పించామన్నారు. అమర సైనికుల త్యాగం మరువలేనిదని గుర్తు చేసుకున్నారు. దేశం పట్ల అమర జవాన్ల అంకితభావం ఎన్నటికీ మరువలేనిదని, వారి త్యాగం రాబోవు తరాలు ఎన్నటికీ మరిచిపోవన్నారు. పుల్వామా వీర జవాన్లకు దేశం రుణపడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గడ్డిమందు విషతుల్యానికి గోల్డెన్ అవర్ కీలకం

### 4--5 గంటల్లో ఆసుపత్రికి తీసుకురండి
### త్వరిత చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు
### నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్

జనోదయ : పెద్దపల్లి




పారాక్వాట్‌గా పిలువబడే గడ్డిమందు సేవించిన వారిని 4 నుంచి 5 గంటల్లోపు ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో ఎండోసల్ఫాన్ వంటి పురుగు మందులు సేవించిన సందర్భాల్లో విరుగుడు అందుబాటులో ఉండటంతో బాధితులను ఎక్కువ శాతం కాపాడగలిగామని చెప్పారు. అయితే ఇటీవలి కాలంలో గడ్డిమందు సేవించే ఘటనలు పెరిగాయని, దానికి ప్రత్యక్ష విరుగుడు లేకపోవడం పరిస్థితిని క్లిష్టం చేస్తోందన్నారు. అయినా సరైన సమయంలో సరైన దశల్లో చికిత్స అందిస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చని తెలిపారు. మెడికవర్‌లో ఇప్పటివరకు గడ్డిమందు సేవించిన సుమారు 200 మందికి చికిత్స అందించగా 52 మందిని కాపాడగలిగామని వెల్లడించారు. అధునాతన ఫిల్టర్లు, ప్రత్యేక వైద్య పద్ధతులతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. బాధితులను తరలించే సమయంలో ఆక్సిజన్ ఇవ్వకూడదని, అది ఊపిరితిత్తుల్లో రసాయన ప్రభావాన్ని మరింత పెంచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను "స్టోన్‌బెల్ట్"గా పేర్కొంటూ కిడ్నీ రాళ్ల సమస్యపై కూడా వైద్యులు అప్రమత్తం చేశారు. షుగర్, రక్తపోటు ఉన్నవారు నడుం నొప్పిని తేలికగా తీసుకోవద్దని సూచించారు. పెయిన్ కిల్లర్ల అధిక వినియోగం కిడ్నీలను దెబ్బతీస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించింది. సమయానికి చికిత్సే ప్రాణరక్షణకు కీలకమన్న సందేశాన్ని వైద్యులు స్పష్టం చేశారు.

# క్రీడలతో నాయకత్వ లక్షణాలు

### అడిషనల్ కలెక్టర్ పి చంద్రయ్య

జనోదయ : మందమర్రి



క్రీడలతో పోటీ తత్వం అలవాడి నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ప్రతి ఒక్కరు తమకు నచ్చిన క్రీడలు రాణించి ఉన్నతంగా జీవించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పి చంద్రయ్య అన్నారు. పట్టణం లోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో రెండవ ఎడిషన్ చీఫ్ మినిస్టర్స్ కప్ - 2025-26 జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఎంపిక పోటీ లలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు అన్ని క్రీడల్లో పాల్గొని తమ ఫిట్నెస్ ను సాధించుకోవాలని క్రీడలు క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి శరీరంతో పాటు మానసిక ఉల్లాసం కలుగు తుందన్నారు. ముఖ్యంగా క్రీడా మైదానంలో వివిధ ప్రాంతాల నుండి వివిధ సంస్కృతుల నుండి విచ్చేసిన టు వంటి క్రీడాకారులు ఒకటిగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏకతాటిపై సమిష్టిగా పోరాటం చేస్తారన్నారు. విద్యార్థులు ర్యాంకుల వైపు పరిగెత్తకుండా పిల్లల్ని క్రీడల వైపు కూడా మరలిచాలని ఆయన తల్లిదండ్రులకు కోరారు. సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ క్రీడల పట్ల సింగరేణి సానుకూలంగా స్పందిస్తుందన్నారు. క్రీడా కారుల సౌకర్యార్థం అవసర మైన వాటికి గ్రౌండ్ సౌకర్యం కల్పిస్తూ క్రీడలను ప్రోత్సహిస్తు న్నామన్నారు. గ్రామ, మండలం, నియోజకవర్గంల నుండి జిల్లా స్థాయి పోటీలకు వచ్చిన క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి విజయ బావుట ఎగరవేయాలని, ఓడిపోయిన వారు నిరుసహానికి గురి కాకుండా తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రమశిక్షణతో నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్, ఎస్సి కార్పొరేషన్ ఎడి చాతరాజుల దుర్గాప్రసాద్, సీఐ పర్శ రమేష్, ఎస్సై గోపతి నరేష్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ రామ్ వేణు, పిడి రోజా వరకుమారి, బాస్కెట్బాల్ కార్యదర్శి సుకుమార ఫ్రాన్సిస్, సీనియర్ క్రీడాకారులు కోచ్ లు, పీడీలు పీఈడీలు, మాస్టర్స తో పాటు పలు క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎస్ అండ్ పిసి ఉద్యోగులను ప్రశంసించిన జిఎం



జనోదయ : మందమర్రి

ఏరియాలోని కేకే ఓసీలు దొంగతనానికి యత్నించిన దొంగలను ఎంతో చాకచక్యంగా పట్టుకొన్న సింగరేణి సీనియర్ సెక్యూరిటీ గార్డ్ , మొబైల్ టాస్క్ ఫోర్స్ సభ్యులు పెద్దపల్లి సదానందం ను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ అభినం దించారు. ఏరియా జిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విధి నిర్వహణ లో ఎంతో ధైర్య సాహసాలను ప్రదర్శించి సాహసోపేతంగా వ్యవహరించిన సెక్యూరిటీ సిబ్బంది సేవలను ఆయన ప్రశంసించారు. సెక్యూరిటీ గార్డ్ సదానందం కు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆస్తులను కాపాడడం లో ప్రతి ఒక్కరు సదానందంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, జూనియర్ ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, జమీందార్ లక్ష్మణ్, ఇంటెలిజెంట్ గార్డ్ కే శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# కనక దుర్గా దేవి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు



### పాల్గొన్న జిఎం రాధాకృష్ణ దంపతులు

జనోదయ : మందమర్రి

ఏరియాలోని ఆర్కే ఓసిపి ఆవరణలోని కనకదుర్గ దేవి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ - శ్రీ వాణి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో జిఎం దంపతులు పాల్గొని గణపతి పూజ, లక్ష్మీ గణపతి హోమం ను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్కె ఓసిపి ఫేజ్--02 పనులు త్వరగా పూర్తి కావాలని, రామకృష్ణ పూర్ కి పూర్వ వైభవం రావాలని, సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు శుభిష్టం గా ఉండాలని ఏరియా జిఎం అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారి కృప, కరుణ, కటాక్షాలు అందరిపై ఎల్ల వేళల ఉండాలని అయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఎస్వోటు జిఎం జి ఎల్ ప్రసాద్, డిజిఎం ఐఈడి కిరణ్ కుమార్, డిజిఎం సర్వే దేశాయ్, ఎస్టేట్ అధికారిని నవనీత, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకటరెడ్డి, ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ డివైసిఎంఓ మధు కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి రవి, ఆర్కే ఓసిపి మేనేజర్ పంకజ్, యూనియన్ నాయకులు, ఆర్కే ఓసిపి ఉద్యోగులు పాల్గొన్నారు.

# నార్లపూర్ వాసులను వేధిస్తున్న రైల్వే గేట్

## గేట్ కష్టాలు తొలగించాలని డిమాండ్

## గ్రామస్తుల ఆందోళన

జనోదయ : మందమర్రి

మున్సిపాలిటీ పరిధిలోని నార్లపూర్ వాసులను రైల్వే గేటు సమస్య గత పది రోజు లుగా తీవ్రంగావేధిస్తుంది. రైల్వే గేట్ ను నిరవధికంగా మూసివేయడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నార్లపూర్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న గ్రామంలో రైల్వే స్టేషన్ ప్రారంభం నుండి రైల్వే గేటు సౌకర్యం కల్పించగా గ్రామస్థులు రైల్వే గేట్ నుండి పట్టణం లోని మార్కెట్ ప్రాంతానికి వ్యక్తిగత పనుల కోసం వచ్చి పనులు తీర్చుకుంటున్నారు. గ్రామస్తులు పట్టణం, మండల కేంద్రానికి రావాలంటే గేట్ మీదుగా రాకపోకలు చేయాల్సి వచ్చేది. గ్రామం లోని రైతులు తమ వ్యవసాయ పనుల కోసం గేటు మీదుగా పంట పొలాలు, చేలకు చేరుకోవాల్సి ఉండగా, గ్రామంలో పాడి రైతులు అధికంగా ఉండగా పాడి రైతులు, పాల వ్యాపారులు, విద్యార్థులు, సింగరేణి కార్మికులు ఈ గేటు మీదుగానే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కాలంగా గేట్ సౌకర్యం వినియోగించుకున్న గ్రామస్తులకు ఒక్కసారిగా గేటు నిరవధికంగా మూసివేయడంతో గ్రామస్తులకు కష్టాలు వచ్చిపడ్డాయి. పట్టణానికి చేరుకోవాలంటే ఇదివరకు గేటు మీదగా రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే పట్టణంలోని మార్కెట్ కు చేరుకొని తమ పనులు పూర్తి చేసుకొని గేట్ మీదుగా గ్రామానికి చేరుకునే వారు. ఇప్పుడు గేట్ ను మూసివేయడంతో గ్రామస్థులు గ్రామం నుండి మార్కెట్ కు వెళ్లాలంటే అందుగుల పేట, పాత బస్టాండ్,మీదుగా మార్కెట్ వరకు సుమారు ఏడు కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని దీంతో దూర భారం పెరగడంతో పాటు సమయం వృధా అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రత్యామ్నాయంగా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు గత వారం రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగి స్తున్నారు. ఆందోళనలో బాగంగా గ్రామస్థులు రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు వెళ్ళే వాహనాలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారు.నత్త నడకన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు..గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందిగా మారిన రైల్వే గేటు సమస్యను పరిష్కరించేందుకు గ్రామస్తుల సౌకర్యార్థం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని ఎంపీ ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి మర్చిపోవడం పరిపాటిగా మారింది. తరచూ గేటు రైల్వే గేటు మూసి ఉంచడం మూలంగా గంటల తరబడి గేటు వద్ద నిరీక్షణ చేస్తూ తమ గమ్యస్థానాలను చేరుకోవాల్సి వస్తుందని దీనివల్ల గేటు వద్ద సమయం వృధా అవుతుందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను తీర్చేందుకు గత ఐదు సంవత్సరాల క్రితం రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు నూతనంగా రైల్వే అండర్బ్రిడ్జి పనులను ప్రారంభించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికీ పనులను నిదానంగా చేపట్టడం మూలంగా గత నాలుగు సంవత్సరాలుగా నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయంటే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అర్థమవుతుంది. ఇదిలా ఉండగా రైల్వే నూతన బ్రిడ్జి పనులు ప్రారంభం కావడంతో నాలుగు సంవత్సరాల అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రైల్వే గేట్ ను నిరవధికంగా మూసివేస్తామని అధికారులు టెండర్ సందర్భంగా ప్రకటించడం విశేషం. టెండర్ ప్రకటనకనుగుణంగా రైల్వే అధికారులు గత పది రోజుల క్రితం గ్రామంలో ఏర్పాటు చేసిన రైల్వే గేట్ ను నిరవధికంగా మూసివేశారు. గేటు మూసివేతకు ముందు 15 రోజులకు ముందు గ్రామస్తులకు రైల్వే అధికారులు సమాచారం అందించి అనంతరం గేటును నిరవధికంగా మూసివేశారు. ఒక్కసారిగా గేట్ మూత పడగా విషయం తెలియని గ్రామస్థులు గేట్ వద్దకు వచ్చి మూసి ఉండటాన్ని గమనించి తిరుగు పయనం అవుతూ తమ పనులు చేసుకుంటు న్నారు. సంవత్సరాల తరబడి రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగు తుండడంతో గ్రామస్తులు కాంట్రాక్టర్ రైల్వే అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడు తున్నారు. సకాలంలో వంతెన పనులు పూర్తి చేసి గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాల్సిఉన్న ప్పటికీ అధికారుల అశ్రద్ధ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా తమకు కష్టాలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా మరో రెండు మూడు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానుండగా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ఇలాగే కొనసాగితే తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి అండర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి గ్రామస్తుల ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రత్యామ్నాయ రహదారి కల్పించాలని కోరుతూ..రైల్వే అండర్ బ్రిడ్జి పనులు సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటం, దీనికి తోడు రైల్వే అధికారులు రైల్వే గేట్ ను నిరవధికంగా మూసివేయడం తో ఆగ్రహించిన గ్రామస్తులు ప్రత్యామ్నాయంగా రహదారి సౌకర్యం కల్పించి గ్రామస్థుల ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేస్తూ రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు వినియోగించే వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు కొనసాగు తుండటం పట్ల గ్రామస్తులు రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అండర్ బ్రిడ్జి పనులు పూర్తి కాకముందే గేటును మూసివేయడం సరైనది కాదంటూ వెంటనే రైల్వే గేట్ ను తెరిపించి యధావిధిగా కొనసాగించాలని, లేదంటే ప్రత్యామ్నాయంగా రహదారి సౌకర్యం కల్పించాలని భీష్మించుకు కూర్చున్నారు దీనిపై స్పందించిన రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ రహదారి సౌకర్యాలను పరిశీలించి రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి రహదారి సౌకర్యం కల్పనకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.





## దక్షిణ భారత కన్వీనర్‌గా

# యర్రం శ్రీరాంరెడ్డి నియామకం

జనోదయ : శేరిలింగంపల్లి

భారతదేశంలో ప్రముఖ ప్రజాస్వామ్య రైతు సంస్థగా పేరొందిన భారతీయ కిసాన్ సంగతన్ (బీకేఎస్) దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాం రెడ్డిని నియమించింది. రైతుల సమగ్ర అభివృద్ధి, స్వావలంబన, ప్రభుత్వ పథకాల అమలు బలోపేతం దిశగా ఈ నియామకం కీలకంగా భావిస్తున్నారు. దక్షిణ భారత రాష్ట్రాలలో వ్యవసాయ నూతన సాంకేతికత, రైతు సంక్షేమం, ప్రభుత్వ పథకాల లబ్ధి రైతులకు చేరేలా సమన్వయం చేయడం తన ప్రధాన లక్ష్యమని శ్రీరాం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంట బీమా పథకాలు సమర్థంగా అమలు చేయడం, అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు (ఎంఎస్ పి) హామీ ఇవ్వడం, సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయడం, అప్పుల బారిన పడిన రైతులకు ఉపశమనం కల్పించడం వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు దేశానికి వెన్నెముక మాత్రమే కాక జీవనాడి అని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమ్ జాతీయ కన్వీనర్ యర్రం వెంకటరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీఎం కిసాన్ సమాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల చివరి రైతు వరకు చేరేలా కృషి చేస్తానని తెలిపారు.




## బుగ్గలో ప్రత్యేక ఆకర్షణగా శివుని విగ్రహం...!



జనోదయ : బెల్లంపల్లి

బుగ్గ దేవస్థానం ఆవరణలో ముందుగా శివుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. తాండూర్ మండలానికి చెందిన కాసన గొట్టు (కేశెట్టి) సుగుణాకర్ జ్ఞాపకార్థం వారి కుమారుడు అభినవ సంతోష్ కుమార్ రూ 2 ల క్షల వ్యయంతో ఈ శివుని విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి ప్రతిష్ఠించారు. బుగ్గ శివాలయంలోతైన ప్రాంతంలో ఉండడంతో ఇక్కడికి వచ్చే భక్తులకు ఒక ధైర్యాన్ని ఇచ్చే విధంగా ఈ విగ్రహాన్ని ప్రత్యేకంగా, ఆకర్షనీయంగా తయారు చేయించారు. లోతైన ప్రదేశం కనిపించకుండా ఈ విగ్రహం భక్తులకు అడ్డంగా కని పించి గుట్ట దిగుతున్న సమయంలో వారి భయాన్ని పో గొడుతుంది. ఇంతటి ప్రత్యేకమైన ఆకర్షణీయమైన ఈ శివుని విగ్రహాన్ని దర్శించి భక్తులు శివరాత్రి నాడు పూజలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తారు.